క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : రామతులసి ఫౌండేషన్ అధ్యక్షురాలు రామతులసి స్థానిక రామేశ్వరం లోని వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి పద్మావతి, సరస్వతి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది, ఎంపీడీఓ

బ్రహ్మంగారిమఠం : ఈ నెల 9న నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలుగురాళ్ల పల్లె, బ్రహ్మంగారిమఠం లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు, మండల అభివృద్ధి అధికారి నులి పురుగులు నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న శ్రీనివాస్

పోరుమామిళ్ల : గ్రంథాలయ పాఠకుల కోసం శ్రీనివాస్ పుస్తకాలు వితరణ చేశారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఆయన బుధవారం లైబ్రేరియన్ ఆఫ్రిదికి అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కమిటీ మెంబర్ ఖాశింవలి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన ఆదిబోయిన సుబ్బయ్య అనే రైతుకు చెందిన గడ్డివామికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపుచేశారు. అప్పటికే గడ్డివామి అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

8న రైతుల ధర్నా

మైదుకూరు : రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 8న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రైతుల ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మైదుకూరులో విలేకరులతో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల వరకు ఉన్న బకాయిలను బేషరతుగా రద్దు చేయాలని కోరారు. రూ.2 లక్షల వరకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు సాగు సహాయం కింద మంజూరు చేయాలని, 90 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం, పి.పి.కుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బద్వేలు రూరల్ ఏఈ చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కె.వి.లైన్‌లో చెట్ల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

కమలాపురం : జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు అందిస్తున్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఇప్పటికి ఎన్ని పూర్తి అయ్యాయి? ఎన్ని చేయాల్సిన ఉన్నాయని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలో 783 ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ఇప్పటికి 265 పూర్తి అయ్యాయని, ఇంకా 518 పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని సిబ్బంది ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రతి లబ్ధిదారునికి అందించే పట్టాను తప్ప రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు.

'నులిపురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయాలి



బి.కోడూరు : పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది



బద్వేలు అర్బన్ : నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరు క్రైం : ఉపాధ్యాయురాలికి మాత్రలను అందచేస్తున్న వైద్యులు

బి.కోడూరు : ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో 1–5 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6–19 సంవత్సరాల లోపు పిల్లలకు, కిశోర బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారని తెలిపారు. నులిపురుగులు సోకిన పిల్లలు వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎస్‌ఎంలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఈ నెల 9వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో, కోటవీధి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎస్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు, కిశోర బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, టీచర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఈ మాత్రలను పిల్లలతో మింగించాలన్నారు. ఈ మాత్రల వలన విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం గోడపత్రాలను విడుదల చేశారు. అలాగే మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రమౌళి, వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని వైద్యాధికారులు హనీఫ్‌బాబా, శివప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నిర్మూలనలో భాగంగా బుధవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడి కేంద్రాల్లోని 1–19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తారన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ పిల్లలకు తప్పకుండా మాత్రలను మింగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, మాధవరెడ్డి, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీనారాయణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైఎంఆర్ కాలనీలో..

స్థానిక వైఎంఆర్ కాలనీలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ హిమబిందు, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేవలో ముందుండాలి

ప్రొద్దుటూరు : సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుండాలని ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపేటలో కాలేజి ఎన్ఎస్ఎస్ యూనిట్–2 వలంటీర్స్ స్పెషల్ క్యాంప్ ముగింపు సందర్భంగా వాలిడిక్టరీ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొత్తపేటలో వారం రోజులుగా స్పెషల్‌క్యాంప్ నిర్వహించామన్నారు. మొక్కలు నాటడం, ఆరోగ్యం, పరిశుభ్రత, నిరుద్యోగంపై ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ వంకం భాస్కర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

ప్రొద్దుటూరు కల్చరల్ : మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం – ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ఉద్యమాన్ని చేపట్టినట్లు జమా అతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడు జనాబ్ షఫివుల్లాహ్ తెలిపారు. బుధవారం స్థానిక జిన్నా రోడ్డులోని జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో ఉద్యమ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు శాఖ ఉద్యమ కన్వీనర్ జహంగీర్, జమా అతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు శాఖ సభ్యులు అబ్దుల్ సమద్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

సీమ అభివృద్ధి కోసం ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయులు

బద్వేలు అర్బన్ : అత్యంత వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి కోసం ఉద్యమిద్దామని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.ఆంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక జీఆర్‌డీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి నేటికి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ విభజన హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. సీమ అభివృద్ధితోపాటు బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి కోసం రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం బద్వేలు ఏరియా కార్యదర్శి జకరయ్య, అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, ఏరియా నాయకులు రామరాజు, సుబ్రమణ్యం, బాబు, చంద్రపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రసాద్‌రెడ్డి

కాశినాయన : పోరుమామిళ్ళలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా తోమాస్‌రెడ్డి దంపతుల సహకారంతో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 127 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో తమ సంస్థ తరఫున ఉచితంగా దుస్తులతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, ఉపాధ్యాయులు వాకాచంద్రశేఖర్, జ్యోతి, మహేష్‌కుమార్, విజయలక్ష్మి, పరిమళజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : అర్హులందరికీ ఇళ్లు కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యం అని తహసీల్దార్ విద్యాసాగర్, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని సచివాలయంలో ఇళ్ల పట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి, వారు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల నాయకులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షులు రామసుబ్బయ్య అధ్యక్షతన తెలుగు ప్రజాపార్టీ రాష్ట్ర పరిశీలకులు ముండ్లపాటి పిచ్చయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ కృషి వెనుక రమాబాయి త్యాగం, సేవ ఉండటమే కాక, ఆయనకు ఆమె చేదోడు వాదోడుగా ఉండి, ఆయన ముందుకు నడిచేందుకు కారణమయిందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జయరాములు, విలియం, వరికుంట్ల పుల్లయ్య, అగస్టీన్, వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో జొన్న కొనుగోలు కేంద్రం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో సోమవారం నుంచి జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఆగ్రామ ఆర్‌బీకేలో విలేకరులతో మాట్లాడుతూ టంగుటూరు ఆర్‌బీకేకు సంబంధించిన రైతులంతా జొన్న పంటను ఈ–క్రాప్ చేయించుకున్న వారంతా ఈ కేంద్రంలో జొన్నలను అమ్ముకోవచ్చునని తెలిపారు. ఎకరాకు 18 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని, క్వింటా ధర రూ.3180 చెల్లిస్తామన్నారు. ఒక్కొక్క రైతుకు సాధారణంగా 15 ఎకరాల వరకు జొన్నపంటను ఏపీ సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జొన్నలు అమ్మే రైతులు గురువారం నుంచి ఆర్‌బీకే వద్దకు శాంపిల్స్ తీసుకొచ్చి టోకెన్లను పొందవచ్చునని చెప్పారు.

టోకెన్లు పొందిన రైతుల జొన్నలను సోమవారం నుంచి కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్‌లైస్ టెక్నికల్ అసిస్టెంట్ మణికంఠ, గ్రామ వీఏఏ శిరీష పాల్గొన్నారు.

ఆధునిక విధానాలను అనుసరిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ : సాంప్రదాయ విధానాలను విడనాడి ఆధునిక పద్ధతులను పరిశోధనల్లో వినియోగించి జంతు జీవకోటిని కాపాడుకుందామని యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. 'మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు – నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు' అన్న అంశంపై రెండు రోజుల సెమినార్ ముగింపు సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రయోగశాలలో జంతువుల స్థానంలో ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించడం పట్ల అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రయోగశాలలో వినియోగించే దిశగా మనం వెళ్లాలన్నారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎస్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల సెమినార్ భావిపరిశోధకులకు విలువైన సమాచారం అందించిందన్నారు. తిరుపతి ఎస్వీయూ ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసర్ వి.హెచ్.రావు ఉపన్యసిస్తూ జంతువులను బాధలనుంచి తప్పించే కొత్త మార్గాలను అన్వేషించే బాధ్యత పరిశోధకులపై ఉందన్నారు. శాంతిభట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్ సీడీఎఫ్‌డీ గ్రూప్ లీడర్ డా. మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ లో ఫింగర్ ప్రింట్స్ ఎలా వినియోగిస్తారు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఊటీ జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ టి.కె. ప్రవీణ్ మాట్లాడుతూ జంతువుల పరిశోధన చరిత్ర, ప్రత్యామ్నాయ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. సదస్సులో సెమినార్ నిర్వహణ సంఘం సభ్యులు డా. ఎస్.పి. వెంకట రమణ, డా. వి. అనుప్రసన్న, డా. ఎ.టి. వెంకట్రమణారెడ్డి, డా. ఎ.ఎస్. పి. మరియదాస్, బి. మనస్వి పాల్గొన్నారు.

వేటూరి ప్రభాకరశాస్త్రికి ఘన నివాళి

బద్వేలు అర్బన్ : ప్రాచీన గ్రంథ పరిష్కర్తగా, శాసన పరిష్కర్తగా తాటి ఆకుల్లో చితికిపోతున్న, చెదపట్టిన ఎంతో సారస్వతాన్ని పునరుద్ధరించిన మహానుభావుడు వేటూరి ప్రభాకరశాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. బుధవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో ప్రభాకరశాస్త్రి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన తాళపత్ర గ్రంథాల సేకరణకై గ్రామగ్రామాన పర్యటించి వాటిని తెలుగుజాతికి అందించిన సాహితీవేత్త ప్రభాకరశాస్త్రి అని కొనియాడారు.

నేడు బహిరంగ వేలం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని వీరపునాయునిపల్లె మండలం కొమ్మద్ది గ్రామ పరిధిలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు చేపలు పట్టుకొనుటకు 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కొమ్మద్ది సచివాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డుతోపాటు రూ. 10 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. రిజర్వాయర్ గుత్త పైకం మొత్తం రూ. 2,66,466 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

బుడ్డ శనగ, కొర్ర పంటల పరిశీలన

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన సచివాలయ పరిధిలో సాగులో ఉన్న బుడ్డ శనగ, కొర్ర పంటలను బుధవారం కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. బుడ్డ శనగ పంటను తుప్పు తెగులు ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని గుర్తించేందుకు ఆకులపై గోదుమ రంగులో గుండ్రని చిన్న తుప్పు మచ్చలు ఏర్పడతాయని తుప్పు తెగులు ఆశించడం వలన పంట నాణ్యత, దిగుబడి తగ్గుతుందన్నారు. దీన్ని గుర్తించిన రైతులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లీటరు లేదా హెక్సా కొనజోల్ 2మిల్లీ లీటరుకు లీటరు నీటిని కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. అలాగే కొర్ర పంటలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించామని దీని నివారణకు ఫ్లూబెండమైండ్ 0.25మిల్లీ లీటరు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు.

వ్యాసరచన పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ సంపత్‌కుమార్, కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్ తెలిపారు. బుధవారం కెనరా బ్యాంకు మరియాపురం శాఖ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు స్వచ్ఛభారత్ అంశంపై ఈ పోటీలు చేపట్టారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. బ్యాంకు మేనేజర్ సింహం రత్న పాల్, ప్రధానోపాధ్యాయురాలు రీమా రోజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓకు ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప డీఈఓగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డికి ఆర్‌జేడీగా పదోన్నతి కల్పించడంతో బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీగా పదోన్నతి పొందిన రాఘవరెడ్డి మాట్లాడుతూ మన పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతానికి కృషి చేయడంతోపాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు రామకృష్ణంరాజు, వేణుగోపాల్‌రావు, మురళీధర్, పాలెం రాజా, వెంకట్రామరాజు, కులశేకర్‌రెడ్డి, చలపతిరాజా తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమంలో రైతులు, కేవీకే బృందం

కడప అగ్రికల్చర్: రైతులు వ్యవసాయంతోపాటు పెరటికోళ్ల పెంపకం చేపడితే అదనపు ఆదాయం సమకూరుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై వల్లూరు, సికెదిన్నె, పెండ్లిమర్రి, ఖాజీపేట మండలాలకు చెందిన రైతులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో ఆరోగ్యకరమైన మాంసంతోపాటు గుడ్లు పొందవచ్చన్నారు. తద్వా రా శరీరానికి అవసరమైన మాంసకృతులు పొందవచ్చని తెలిపారు. పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌రెడ్డి పెరటికోళ్ల యాజమాన్య పద్ధతులు, టీకాలు వేయించవలసిన పట్టిక, రోగా లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణంగా వివరించారు. అనంతరం అస్సీర్ జాతి కోళ్లను షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక కింద పెంచుకోవడానికి రైతులకు అందచేశారు. కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : నులిపురుగుల నివారణపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం మున్సిపల్ కమిషనర్ పట్టణ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రతి పాఠశాలలో చేపట్టాలని కోరారు. ఇందుకు తల్లిదండ్రులందరూ సహకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాదరెడ్డి, ఎంఈఓ శోభారాణి, అర్బన్ సీడీపీఓ హైమావతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో సెల్ టవర్ నిర్మాణం



ప్రభుత్వ భూమిలో నిర్మించిన సెల్ టవర్

గోపవరం : మండలంలోని పి.పి.కుంట వద్ద గోపవరం రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1557లో రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే అనేకమార్లు సెల్ టవర్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు టవర్ నిర్వాహకులకు చెప్పడం జరిగింది. ఎలాంటి పనులు చేయవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత అధికారుల వద్ద ఎన్‌ఓసీ పొందాల్సి ఉంది. అలాంటివి ఏవీ చేయకుండానే ఏకంగా టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. అనుమతి లేకుండా టవర్ ఏర్పాటు చేయడం వల్ల స్థానికులు కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, గ్రామీణ రహదారుల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో వాటిని గుర్తించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామని ఆయా ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, సూచికలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు లక్ష్మీ ప్రసన్న, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కడప నాగార్జున డిగ్రీ కళాశాలలో రాయల్ రసీద్ ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి వీరారెడ్డి, కమిటీ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.